రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు, డ్రెయినేజీల్లో పేరుకున్న చెత్తాచెదారం

మహదేవపూర్‌లో పారిశుధ్య లోపం

మహదేవపూర్ మండల కేంద్రంలోని గొల్లవాడలో పారిశుధ్యం లోపించి దుర్వాసన వస్తోంది. నిర్వహణ సరిగా లేక డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దోమలు, ఈగలతో అనారోగ్యానికి గురవుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. - మహదేవపూర్, ఏప్రిల్ 21

రహదారిపై నిలిచిన మురుగు నీరు

తునికాకు కోసుడు ఇంకెప్పుడో!

- సేకరణకు సిద్ధంగా తునికాకు
- వేసవిలో ఉపాధి పొందుతున్న ఏజెన్సీ వాసులు
- గిట్టుబాటు ధర కల్పించాలని వినతి

వాజేడు మండలంలో కోతకు సిద్ధంగా ఉన్న తునికాకు

వాజేడు, ఏప్రిల్ 21: మండలంలోని అటవీ ప్రాంతంలో తునికాకు చిగురించి ఆకులు సేకరణకు సిద్ధంగా ఉన్నాయి. ములుగు డివిజన్ ఏజెన్సీ మండలాలైన వాజేడు, వెంకటాపురం, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం మండలాల్లో ఏప్రిల్‌లో ఏటా అటవీశాఖ, తునికాకు వ్యాపారుల ఆధ్వర్యంలో తునికాకు సేకరిస్తారు. వాజేడు, వెంకటాపురం మండలాల్లోని వెంకటాపురం, ఆలుబాక, చీకుపల్లి, పేరూరు యూనిట్ల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రజలు తునికాకు సేకరింటారు. వేసవిలో ఈ ప్రాంతవాసులకు తునికాకు సేకరణ ఉపాధిగా మారుతుం. ఉదయాన్నే చి న్న, పెద్ద తే డా లేకుండా కుటుంబ స భ్యులందరూ కలిసి బుర్రల్లో తాగునీరు, అంబలి పోసుకొని తునికాకు సేకరణకు వెళ్తారు. సేకరించిన తునికాకుతో ఇంటికి వచ్చాక అంతాకలిసి భోజనాలు చేసిన తర్వాత కట్టలు కట్టి కల్లాల్లో విక్రయిస్తారు. తునికాకు సేకరణతో వేసవిలో జీవనోపాధి పొందుతారు. ఈసారి తునికాకు కట్టకు గిట్టుబాటు ధర కల్పించాలని, బోనస్ వెంటనే చెల్లించాలని సేకరణదారులు కోరుతున్నారు. తునికాకు సేకరణ సమయంలో వడదెబ్బ, పాముకాటు, ఎలుగుబంట్లదాడులకు గురవుతుంటారు. గుట్టలపైకి వెళ్లి తునికాకు సేకరిస్తారు. ఈ ఏడాది తునికాకు ఏపుగా పెరిగి కోతకు సిద్ధంగా ఉన్నా సేకరణ పనులు ఇంకా ప్రారంభించకపోవడంతో ఎప్పుడు ప్రారంభిస్తారని సేకరణదారులు ఎదురుచూస్తున్నారు.

వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

బస్వరాజుపల్లిలో వైద్య శిబిరం

గణపురం, ఏప్రిల్ 21: మండలంలోని బస్వరాజుపల్లిలో ఆదివారం శ్రీహిత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ పాశం నాగరాజు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రక్తపరీక్షలతోపాటు మందులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని నగరంపల్లికి చెందిన తాను ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎండీ జనరల్ ఫిజీషియన్‌గా ఎదిగినట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తానని చెప్పారు.

అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు

గణపురం, ఏప్రిల్ 21: మండల కేంద్రంలోని గణప సముద్రంతోపాటు మండలంలోని చెరువులు, కుంటల్లో నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఐబీ డీఈఈ బసవప్రసాద్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రైతుల పేర అనుమతులు పొంది రియల్ ఎస్టేట్ వెంచర్లు, ప్రైవేట్ స్థలాల్లోకి తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇక నుంచి అలాంటి వాటికి అవకాశం లేదని తెలిపారు. రైతులు పొలాలకు మట్టి తరలించుకోవాలంటే వరి కోతల తర్వాత అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. ప్రైవేట్ స్థలాలకు మట్టిని తరలించే ట్రాక్టర్లు, జేసీబీని సీజ్ చేస్తామని తెలిపారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

విద్యార్థులను తనిఖీ చేస్తున్న ప్రిన్సిపాల్ భిక్షపతి

చిట్యాల, ఏప్రిల్ 21 : 2024-25 విద్యా సంవత్సరానికి 5, 6, 7, 8, 9 తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు గురుకులాల జిల్లా సమన్వయ అధికారి, ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి తెలిపారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన గురుకుల ప్రవేశపరీక్షకు 459 విద్యార్థులకు గాను 429 విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాన్ని రీజినల్ కోఆర్డినేటర్ విద్యారాణి తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.

పశువులను తరలిస్తున్న ఐదుగురిపై కేసు

గోవిందరావుపేట, ఏప్రిల్ 21 : పశువులను అక్రమంగా తరలిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కమలాకర్ ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా డీసీఎం, బొలెరో, మరో వాహనం అనుమానస్పదంగా కనిపించినట్లు పేర్కొన్నారు. తనిఖీ చేయగా ఆయా వాహనాల్లో 54 పశువులు కట్టేసి ఉన్నాయని వివరించారు. వారిని విచారించగా చత్తీస్‌గఢ్ నుంచి అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం బుధరావుపేటకు చెందిన గగులోత్ బాలాజీ, గీసుకొండ మండలం కొమ్మాలకు చెందిన ధరంసోత్ శ్రీను, పల్లె ప్రభుదేవా, ములుగు జిల్లా మల్లంపల్లికి చెందిన ఎదునూరి యుగేంధర్, జంగాలపల్లికి చెందిన కనకం నరేశ్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు. పశువులను అక్రమ రవాణా చేయడం చట్ట రీత్యా నేరమని ఎస్సై అన్నారు.

రామప్పలో సండే సందడి

పూజలు చేస్తున్న భక్తులు

వెంకటాపూర్, ఏప్రిల్ 21: రామప్ప దేవాలయం ఆదివారం పర్యాటకులు, హనుమాన్ స్వాములు, భక్తులతో సందడి నెలకొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజల తర్వాత తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించగా ఆసక్తిగా విన్నారు. రామప్ప సరస్సుకు చేరుకొని బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

మల్హార్, ఏప్రిల్ 21: విద్యుత్ షాక్‌తో ఓ ఎద్దు మృత్యువాత పడింది. మండలంలోని తాడిచర్ల గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ లేకపోవడంతో మేసేందుకు వెళ్లిన ఎద్దు వైరును తాకి షాక్ కొట్టి మృతిచెందిందని రైతు గొడుగు రవి పేర్కొన్నాడు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహించడం వల్లే సుమారు రూ.40వేల విలువైన ఎద్దును కోల్పోయానని, విద్యుత్ అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరాడు.

కర్కపల్లి పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతున్న పంచాయతీ కార్యదర్శి శ్రావణి

గణపురం, ఏప్రిల్ 21 : మండలంలోని కర్కపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి పల్లెబోయిన శ్రావణి ఆదివారం గాంధీనగర్‌లో అద్దెకు ఉంటున్న గదిలో ఉరేసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. అరుపులు విన్న చుట్టుపక్కల వారు చికిత్స కోసం వరంగల్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం శ్రావణి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమెకు వైద్యం చేయించుకునే ఆర్థికస్థోమత లేదని, దాతలు సాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరారు. ఆర్థికసాయం చేసే వారు పుప్పాల శ్రీకాంత్‌కు చెందిన 8125384097 నంబర్‌కు ఫోన్ పే చేయాలని కోరారు.

సైబర్ మోసం.. రూ.3.31లక్షలు మాయం

మహదేవపూర్, ఏప్రిల్ 21 : మండలంలో ఓ వ్యక్తి సైబర్ మోసానికి గురయ్యాడు. ఎస్సై చక్రపాణి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుదురుపల్లికి చెందిన నీర్ల జీవన్‌కు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఓటీపీ చెప్పాలని కోరాడు. వెంటనే అతడు ఓటీపీ చెప్పాడు. దీంతో జీవన్ ఐసీఐసీ బ్యాంక్ ఖాతా నుంచి సుమారు రూ.3.31లక్షలు మాయమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

రెండు మోటర్లతో దేవాదుల పంపింగ్

కన్నాయిగూడెం, ఏప్రిల్ 21: మండలంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులో రెండు మోటర్ల ద్వారా పంపింగ్ జరుగుతోంది. ముందుగా ఒక మోటర్ ద్వారా గోదావరి నీటి పంపింగ్ ప్రారంభించిన నీటిపారుదలశాఖ అధికారులు ఆదివారం మరో మోటర్ ఆన్ చేశారు. ఫేస్-2, ఫేస్-3లో ఒక్కో మోటర్ ఆన్ చేసి రోజూ 539 క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నట్లు నీటిపారుదల శాఖ డీఈ శరత్, ఏఈఈ సాయిరాం తెలిపారు. దిగువనున్న సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. ఎగువ నుంచి 200 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా బరాజ్ ఒక గేటును స్వల్పంగా పైకెత్తి 100 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బరాజ్ వద్ద గోదావరి నీటిమట్టం 75 మీటర్లుగా నమోదైంది.

అక్షయకు వైద్య ఖర్చులు చెల్లిస్తాం

కలెక్టర్ భవేశ్‌మిశ్రా

అక్షయను ఎత్తుకున్న తండ్రి నరేశ్

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 21 : కాళ్లకు కాలిన గాయాలైన చిన్నారి అక్షయకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని ఎల్‌బీ నగర్‌కు చెందిన కాజీపేట నరేష్, సుమలత దంపతులకు కూతురు, కొడుకు ఉన్నారు. గత ఏడాది దీపావళి వేడుకల్లో పటాకులు కాల్చుతుండగా అక్కడే ఉన్న ఏడేళ్ల కూతురు అక్షయ బట్టలకు నిప్పంటుకొని రెండు కాళ్లు, నడుము వరకు తీవ్రంగా కాలిపోయింది. దీంతో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. కాగా, పూర్తిగా కోలుకోలేదని, ఒక కాలికి ఆపరేషన్ చేయాల్సి ఉందని, ఇందుకు సుమారు రూ.2లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో నిరుపేద అయిన తండ్రి నరేశ్ మీడియా ద్వారా దాతల సహకారం కోరారు. ఈమేరకు కలెక్టర్ స్పందించి తక్షణమే చిన్నారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అవసరమైతే హైదరాబాద్‌కు పంపుతామని, అందుకయ్యే ఖర్చులు భరిస్తామని తల్లిదండ్రులకు ఫోన్ చేసి ధైర్యం చెప్పారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ భవనం ప్రారంభం

భవనాన్ని ప్రారంభిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ములుగు రూరల్, ఏప్రిల్ 21: మండలంలోని జాకారం సమీపంలో ఆదివారం ములుగు జిల్లా లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన భవనాన్ని ప్రారంభించారు. అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ లారీలను నిలిపేందుకు స్థలం లేక ఇన్నాళ్లు ఇబ్బందులు పడగా, సొంత స్థలంలో భవనాన్ని నిర్మించుకున్నట్లు తెలిపారు. అసోసియేషన్ నాయకులు రాజు, చంద్రశేఖర్, ఖాజాపాషా, రామకృష్ణ, బ్రహ్మచారి, కుతుఫోద్దీన్, దామోదర్‌రెడ్డి, కరుణాకర్, రాంబాబు, సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, సమ్మయ్య ఉన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో విద్యార్థుల బృందం

30 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు

గణపురం జడ్పీ స్కూల్‌లో 1993-94 టెన్త్ బ్యాచ్ సమ్మేళనం

గణపురం, ఏప్రిల్ 21: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 1993-94 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన 51 మంది విద్యార్థులు మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్నారు. తాము చదువుకున్న నాటి రోజులను గుర్తుచేసుకున్నారు. ఎవరు ఏయేస్థాయిల్లో ఉన్నారో వివరాలు ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. కష్టాల్లో సాయం చేసుకునేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. అందరూ మెమెంటోలు అందుకున్నారు. పూర్వ విద్యార్థులు గుర్రం తిరుపతిగౌడ్, బొట్ల కృష్ణంరాజు, అంకం చంద్రమౌళి, గుర్రాల శ్రీనివాస్‌రెడ్డి, గుంటోజు సదానందం, చిలుమోజు భాస్కర్, బందారపు తిరుపతిగౌడ్, నారగాని ప్రసాద్, నారగాని లక్ష్మణ్, కుక్కముడి సంపత్, అల్లం స్వామి, మార్క కుమారస్వామి, గొట్టె పురుషోత్తం, శ్రీనివాస్, కొడారి ఓదెలు, సదయ్య పాల్గొన్నారు.

అరుణాచలపురంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్

అరుణాచలపురం గ్రామస్తులతో వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు

వాజేడు, ఏప్రిల్ 21 : మండలంలోని మురుమురు గ్రామ పంచాయతీ అరుణాచలపురంలో ఆదివారం కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాజేడు ఎస్సై చావాళ్ల వేంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలోకి అపరిచితులు వస్తే సమాచారం అందించాలని సూచించారు. అనంతరం గ్రామ శివారులోని వాజేడు, వెంకటాపురం వెళ్లే ఆర్ అండ్‌బీ ప్రధాన రహదారిపై ఎస్సై వెంకటేశ్వరరావు సీఆర్పీఎఫ్ పోలీసులతో కలిసి ముమ్మరంగా వాహన తనిఖీలు చేశారు.

నామినేషన్ దాఖలుకు తరలిరండి

బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 21: వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా సుధీర్‌కుమార్ సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నందున పెద్ద సంఖ్యలో హనుమకొండకు తరలాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 9.30గంటలకు బాలసముద్రం నుంచి ఏకశిలా పార్క్ వరకు నిర్వహించే ర్యాలీలో భూపాలపల్లి నియోజకవర్గంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరు కావాలని పేర్కొన్నారు. సుధీర్‌కుమార్ వరంగల్ కలెక్టర్‌కార్యాలయంలో నామినేషన్‌వేస్తారని తెలిపారు.

పట్టుకున్న గుడుంబాను చూపుతున్న పోలీసులు

గుడుంబా స్థావరంపై పోలీసుల దాడి

మహదేవపూర్(మహాముత్తారం), ఏప్రిల్ 21 : మండలంలోని గుడుంబా స్థావరంపై పోలీసులు ఆదివారం దాడులు చేశారు. ఎస్సై పీ.మహేందర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోలారం గ్రామానికి చెందిన ఎర్రోళ్ల లక్ష్మీనారాయణ సమీప చెట్లలో గుడుంబా తయారు చేస్తున్నాడు. సమాచారం మేరకు దాడిచేసి 40లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని, 400 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏ సర్వే చూసినా బీఆర్ఎస్‌దే విజయం

- 50 వేల మెజార్టీతో సుధీర్‌కుమార్ గెలుపు సాధించడం ఖాయం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ఐనవోలులో పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఐనవోలు, ఏప్రిల్ 21 : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో 50 వేల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి మారపల్లి సుధీర్‌కుమార్ గెలువబోతున్నట్లు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ముందుగా మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన మూడు నెలల్లో రాష్ట్రంలో వచ్చిన మార్పుతో ప్రజలు అనేక ఇబ్బందుల ఎదుర్కొంటున్నారన్నారు. ఒక్కసారి కేసీఆర్‌ను కాదు అనుకున్నందుకు ఈ ఇబ్బందులు వచ్చాయని, ఎలాగైనా పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ వెంటనే ఉండాలని ప్రజానీకం నిర్ణయం తీసుకున్నట్లుగా గుర్తుజేశారు. ఏ సర్వే చూసినా బీఆర్ఎస్‌దే గెలుపు ఖాయమన్నారు. తెలంగాణ ఎదుగుదలను చూసి ఆంధ్రా గురువుకు శిష్యుడైన రేవంత్‌రెడ్డి, కేంద్రలో ఉన్న నాయకులు ఓర్వలేకపోయారన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమాలు వస్తలేవు, ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఇస్తామన్న పథకాలకు ఇంకా మొదలే కాలేదని విమర్శించారు. మోదీ దేశానికి ప్రధానమంత్రా.. లేక ఒక గుజరాత్ రాష్ట్రానికే అర్థం కావడం లేదన్నారు. దేశంలో ఏ కొత్త కంపెనీ, ప్రాజెక్టు, ఇంకా ఏదైనా కొత్తది వచ్చిందంటే పట్టుబట్టి గుజరాత్ రాష్ట్రానికి తరలించుకపోతున్నట్లుగా గుర్తుజేశారు.

ఆ నాయకులపై ప్రజలు కోపంగా ఉన్నారు..

ఐనవోలు ప్రజలు ముగ్గురు నాయకులపై కోపం గా ఉన్నారు.. ఇందులో ఒకరు కడియం శ్రీహరి, ఇంకొకరు అరూరి రమేశ్, మరొకరు మార్నేని రవీందర్‌రావుపై ప్రజలు కోపంగా ఉన్నారని, అవకాశమస్తే కసి తీరా ఓడించాలని ప్రజలు చూస్తున్నట్లుగా ఆయన వివరించారు. శ్రీహరి ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి పోయే వలస పక్షిలాంటోడు. అరూరి రమేశ్ కన్న తల్లిపాలు తాగి రొమ్మును కుద్దిపోయే మనిషన్నారు. మార్నేని రవీందర్‌రావు అన్నం పెట్టిన పార్టీకే సున్నం పెట్టే నాయకుడని ఆయన ఎద్దేవా చేశారు. మీరు ఇతర పార్టీలకు వెళ్లిపోయా రు.. పోతేపొండి.. కానీ, బీఆర్ఎస్ కార్యకర్తలకు ఫోన్లు చేసినా తమ పార్టీలోకి రండి.. అని పిలువడం బంద్ చేయాలి. మీరంటే ప్రజలు, కార్యకర్తలు, నాయకుల్లో నమ్మకం పోయిందన్నారు. అట్లాని తమ పార్టీలకు రావడం లేదని ఏదైనా ఇబ్బంది పెట్టి కేసు ల్లో ఇంకా ఏదైనా ఇబ్బందులు పెడితే పోలీసు స్టేషన్ ఎదుట కూర్చోని ధర్నా చేస్తానని హెచ్చరించారు.

నా గెలుపు బీఆర్ఎస్ కార్యకర్తల గెలుపే : ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్

బీఆర్ఎస్ పార్టీలో తాను ఒక సామాన్య కార్యకర్తనని.. తన సేవలను గుర్తించి కేసీఆర్ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. అందుకే ఒక కార్యకర్తగా తన గెలుపు బీఆర్ఎస్ కార్యకర్తల గెలుపేనని ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే తాగడానికి, పంటకు నీళ్లు, కరెంటు ఇవ్వకుండా తెలంగాణ ప్రజలను అరిగోస పెడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మన హక్కులు మనకు రావాలంటే కేంద్రంలో కొట్లాడే పార్టీ బీఆర్ఎస్ ఉండాలని, పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్‌లో బీఆర్ఎస్ గెలువబోతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వాసుదేవరెడ్డి, కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, హసన్‌పర్తి మండలాధ్యక్షుడు రజీని, జడ్పీ కోఆప్షన్ ఉస్మాన్ అలీ, వైస్ ఎంపీపీ మోహన్, సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, మండల కోఆప్షన్ గుంషావలి, మండల ఇన్‌చార్జి గోపాల్‌రావు, ఎంపీటీసీ కే రాజు, మాజీ సర్పంచ్‌లు సురేశ్, సదానందం, కే స్వామి, నాయకులు రాజు, రాఘవులు, సతీశ్, అశోక్, కుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలు తెలుపుతున్న పోలీసులు

చొక్కాల గ్రామంలో గంజాయి స్వాధీనం

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 21 : మండలంలోని చొక్కాల గ్రామ శివారులో ఆదివారం పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామ సమీపంలో కొందరు గంజాయి తాగుతున్నారనే సమాచారం మేరకు వెంకటాపురం సీఐ బండారు కుమార్, ఎస్సై రేఖ సిబ్బందితో కలిసి దాడి చేశారు. చొక్కాల గ్రామ శివారు శ్మశానవాటిక సమీపంలో ఐదుగురు గంజాయి తాగుతూ కనిపించారు. పారిపోతుండగా పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. విచారించగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన హేమంత్, రోహిత్, జావెద్, వెంకటాపురం మండలం చొక్కాల గ్రామానికి చెందిన కార్తీక్, ఉపేందర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి అర కిలో గంజాయి స్వాధీనం చేసుకొని, కేసునమోదు చేసినట్లు వివరించారు.

హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌ను ఓడించాలి

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 21: హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామల మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామల మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలు, రైతుల గురించి ఆలోచించలేదని, అసెంబ్లీ ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి నెరవేర్చలేకపోయారని అన్నారు. దళిత మోర్చా రాష్ట్ర అధికారి ప్రతినిధి బట్టు రవి, అర్బన్ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు సుధాకర్, బూత్ అధ్యక్షులు సారయ్య, రవి, సునీల్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై చక్రపాణి

మేడిగడ్డ వద్ద వాహన తనిఖీలు

మహదేవపూర్, ఏప్రిల్ 21 : మండలంలోని మేడిగడ్డ బరాజ్ వద్ద ఎస్సై చక్రపాణి ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, పత్రాలు, బ్యాగులను పరిశీలించారు. సరైనపత్రాలు లేని వారికి జరిమానా విధించారు. సీఆర్ఎఫ్ బలగాలు, టీఎస్ఎస్పీ, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-323227

WANTED

jobs Apply Now!

★Wanted PRO's for degree College admissions (22 years Experience College). Contact Immediatly Cell: 8121554649
NTW-000

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565